ప్రజాశక్తి
గురువారం 11 ఏప్రిల్ 2024 5
శ్రీ సత్యసాయి



టిడిపిలోకి ఇక్బాల్

చంద్రబాబు సమక్షంలో చేరిక

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరుతున్న మహ్మద్ ఇక్బాల్

రిటైర్డ్ ఐపిఎస్ అధికారి, హిందూపురం వైసిపి మాజీ సమన్వయకర మహమ్మద్ ఇక్బాల్ టిడిపిలో చేరారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు సమక్షంలో బుధవారం నాడు టిడిపిలో చేరారు. తెలుగుదేశంలో ఇక్బాల్ చేరికతో ఆయనకు టిడిపి ఎటువంటి అవకాశాలు కల్పించనుందన్న చర్చ నడుస్తోంది. ఎందుకంటే ప్రాధాన్యత లేదని వైసిపిని వీడి టిడిపిలోకి చేరారు. 2019 ఎన్నికలకు ముందు ఇక్బాల్ రిటైర్డు అయిన తరువాత వైసిపిలో చేరారు. కర్నూలు జిల్లా వాస్తవ్యుడు అయినప్పటికీ మైనార్టీలు అధికంగానున్న హిందూపురం అసెంబ్లీ స్థాయిలో పోటీ చేస్తే బాగుంటుందని భావించి వైసిపి ఆయన్న అక్కడ పోటీలో నిలిపింది. అప్పటికే అక్కడ ఇన్‌ఛార్జిగా ఉన్న నవీన్ నిశ్చల్‌కు కాదని మహమ్మద్ ఇక్బాల్‌కు టిక్కెట్టు ఇచ్చారు. అయితే నందమూరి బాలకృష్ణ చేతిలో ఆయన ఓటమి చెందారు. ఎన్నికల్లో ఓడిపోయినా ఇక్బాల్‌కు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవిని ఇచ్చారు. వైసిపి హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్తగానూ ఉంటూ వచ్చారు. గతేడాది ఆయన్ను నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బాధ్యతల నుంచి వైసిపి తప్పించింది. ఆ స్థానంలో దీపికకు పగ్గాలు అప్పగించారు. టికెట్ల కేటాయింపు సమయంలో ఇక్బాల్‌కు ఎక్కడా అవకాశం కల్పించకపోవడంతో మనస్థాపంతో ఆయన ఇటీవలే వైసిపికి రాజీనామా చేశారు. అదే విధంగా ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేశారు. ఇప్పుడు ఆయన తెలుగుదేశం పార్టీలో చేరారు. తెలుగుదేశంలో ఆయనకు ఎటువంటి అవకాశం లభిస్తుందన్న చర్చ నడుస్తోంది. మైనార్టీ నాయకుడిగా, అధికారిగా ఉన్న ఆయనకు టిడిపి ఏ మేరకు ప్రాధాన్యత కల్పించనుందన్నది రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. టిక్కెట్ల కేటాయింపు తరువాత కొన్ని నియోజకవర్గాల్లో అసంతృప్తులు కొనసాగుతున్నాయి. ఇక్కడ సర్దుబాటు కాని నియోజకవర్గాల్లో మార్పులు చేపట్టాలని టిడిపి భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో మహమ్మద్ ఇక్బాల్ పేరును ఒక నియోజకవర్గానికి పరిశీలిస్తున్నారన్న ప్రచారం ఉంది. మార్పు చేపట్టడం ద్వారా మైనార్టీల మద్దతును టిడిపి కూగట్టేందుకు వీలు కలుగుతుందన్న అభిప్రాయంతో ఉన్నట్టు తెలుస్తోంది. ఎ స్థానంలో ఈ మార్పు ఉంటాదన్నదానిపై చర్చ ఆసక్తికరంగా మారింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అర్బన్ నియోజకవర్గంలో మైనార్టీల సంఖ్య చెప్పుకోదగిన స్థాయిలో ఉంది. అనంతపురం, కదిరి, హిందూపురం, తాడిపత్రి, గుంతకల్లు తదితర పట్టణాల్లో మైనార్టీల శాతం పది కంటే ఎక్కువగానే ఉంది. ఫలితాలపై వీరి ప్రభావం కొంత వరకు ఉండే అవకాశాలూ ఉన్నాయి. దీంతో జిల్లాలో మైనార్టీ నాయకుడిగా మహమ్మద్ ఇక్బాల్‌ను ముందుకు తీసుకొచ్చే ఆలోచనలో టిడిపి ఉన్నట్టు సమాచారం. ఒకవేళ అవకాశం కల్పించలేకపోతే ఆయనుకు ఎక్కడ ప్రాధాన్యత కల్పించనున్నారన్నది చూడాల్సి ఉంది. ఇక్బాల్ సొంత జిల్లా అయినా కర్నూలులోనైనా వినియోగించుకునే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. కర్నూలు జిల్లాలో కూడా కొన్ని నియోజకవర్గాల్లో మైనార్టీల ప్రభావం ఎక్కువగానే ఉంది.



నేడు ఈదుల్ ఫితర్

ఈద్గాల వద్ద ముస్లిములు ప్రార్థనలు


ప్రజాశక్తి-అనంతపురం

ఈదుల్ ఫితర్‌ను ముస్లిములు గురువారం జరుపుకోనున్నారు. రంజాన్ మాసం ప్రారంభం నంచి నెల రోజుల పాటు కఠిన ఉపవాసదీక్షను ముస్లిములు పాటించారు. బుధవారం సాయంత్రం నెలవంక కనిపించడంతో రంజాన్ పండుగను గురువారం నిర్వహించాలని మత పెద్దలు నిర్ణయించారు. ఈ ప్రకారం గురువారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలను ఈద్గాల్లో చేస్తారు. ముస్లిములు అతి పెద్ద పండుగ ఎంతో వైభవంగా జరుపుకునే పండుగ ఇది. ఈ పండుగ సందర్భంగా ఉదయం ఈద్గాకు వెళ్లే ముందు దానం చేస్తారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలను చేస్తారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని హౌసింగుబోర్డు స్థలంలో ప్రార్థనలకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లాలోని తాడిపత్రి, రాయదుర్గం, గుంతకల్లు, ధర్మవరం, కదిరి, హిందూపురం తదితర ప్రాంతాల్లో ప్రార్థనలకు ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేశారు. అనుకూలమైన చోట ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు.

చెక్‌పోస్టుల్లో నిరంతర నిఘా

ప్రజాశక్తి-హిందూపురం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కర్నాటక సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో నిరంతరం నిఘా ఉండాలని సెబ్ అధికారులను డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. ఆయన బుధవారం హిందూపురం, మడకశిర సెబ్ స్టేషన్లతో పాటు తూమకుంట, కొడికొండ చెక్ పోస్టులను సందర్శించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. హిందూపురంలో అధికారులతో సమీక్ష, సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమ రవాణా, నిల్వ చేసే అవకాశం ఉందని, దానిపై పూర్తి నిఘా ఉంచి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. కర్నాటక నుంచి మద్యం అక్రమంగా తరలించే అవకాశాలు ఉండడంతో చెక్ పోస్టుల్లో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. మద్యం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట హిందూపురం, మడకశిర సెబ్ సిఐలు రాజశేఖర్‌గౌడ్, ధీరజ్‌రెడ్డి, కొడికొండ చెక్‌పోస్టు సిఐ శ్రీరాములు, తూమకుంట చెక్‌పోస్టు ఎస్ఐ చంద్రశేఖర్ ఉన్నారు.



టమోటా ధర ఎరుపెక్కింది... కోడి ధర కొండెక్కింది. పచ్చి మిర్చి మంట పుట్టిస్తోంది. నూనె, పప్పులు ధరలూ ఆకాశాన్నంటాయి.. కూరగాయలు, నిత్యావసరాలు, మటన్, చికెన్ ధరలు కొండెక్కాయి. పెరిగిన ధరలు పేద మధ్యతరగతి కుటుంబాలకు చుక్కలు చూపిస్తున్నాయి. పెరిగిన ధరలు సామాన్య, మధ్యతరగత పేద కుటుంబాలకు చుక్కలు చూపిస్తున్నాయి. పండుగ పూట కనీసం రుచికరమైన బోజనం తినలేక నోటికి కుట్లు వేసుకునే పరిస్థితి నెలకొంది. కోడిని కోయలేం.. మటన్ కొనలేం అంటూ కోరికలు చంపుకుని నోరు కట్టుకునే పరిస్థితి దాపురించింది. ధరలు ఇలాగే కొనసాగితే పెరుగు పచ్చిడి మెతుకులే పంచభక్ష పరమాణ్ణాలుగా భావించి తినే పరిస్థితి వస్తుందని ప్రజలు

- కొండెక్కిన ధరలు..!
- కోడి కోయలేం.. మటన్ కొనలేం..
- సామాన్యుడికి భారంగా చికెన్, మటన్ రేట్లు
- రంజాన్ పండుగ వేళ మరింత భారం

చుక్కల్లో నిత్యావసరాలు..!

ప్రజాశక్తి-హిందూపురం

ఎండనకా, వాననకా కష్టపడి తెచ్చే నాలుగు రూపాయలతో కుటుంబాన్ని ఈదలేక రుచికరమైన తిండి అందించలేక తాను తినలేనక మధ్యతరగతి కుటుంబాలు సతమతం అవుతున్నాయి. కూరగాయల మార్కెట్‌లోకి వెళ్లాలంటే మండే ధరలతో గుండె ఆగినంత పని అవుతోందని బాధపడుతున్నారు. గతంలో రూ.150లు ఉంటే బ్యాగు నిండ కూరగాయలు వచ్చేవని, పెరిగిన ధరలతో రూ.500లు తీసుకెళ్లినా నిండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంపదంతా కూరగాయలకు వెచ్చిస్తే ఇక సంసారాన్ని ఎలా ఈదాలో అర్థం కాక సామాన్యుడి తలపట్టుకుంటున్నారు.

పండుగ రోజుల్లో దూరమవుతున్న ఆనందం

సంవత్సరం అంతా కష్టపడి పనిచేసినప్పటికీ కలుగని ఆనందం పండుగ రోజుల్లో కలుగుతుంది. ఆరోజు ఇంటిల్లిపాది రుచికరమైన భోజనం చేసుకుని తింటారు. ఇప్పటికే ఉగాది పండుగ ముగిసింది. గురువారం నాడు రంజాన్ పండుగ ఉంది. రంజాన్ పండుగ రోజు ఎక్కువగా మాంసాహారాన్ని చేసుకుంటారు. ప్రస్తుతం పెరిగిన ధరలతో ఇష్టమైన వంటలు చేసుకుని తినే అవకాశం కూడా లేకుండా పోయింది. గతంలో కేజీ చికన్ రూ.100 నుంచి రూ.120 ఉండగా ఇప్పుడు రూ.250 నుంచి రూ.300కు పెరిగింది. మటన్ ధర అయితే కిలో రూ.800 నుంచి 1000 వరకు ఉంది. గతంలో ఇంటికి రెండు కిలోలు తీసుకెళ్లే వారు పెరిగిన ధరలతో ఒక కిలోతోనే సరిపెడుతున్నారు. టమోటా 10 రోజుల క్రితం రూ.15 ఉంటే నేడు ఏకంగా రూ.40కు పెరిగింది. పెరిగిన ధరలతో ఏది కొనాలో అర్థం కాక పేద మధ్యతరగతి కుటుంబాలు సతమతం అవుతున్నాయి.





హిందూపురంలోని ఓ మటన్ కేంద్రం



కొనలేకపోతున్నాం..

ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న కూరగాయలు ధరలు కొనలేని పరిస్తితి ఉంది. ఏ ఒక్కటి పట్టుకున్నా కిలో రూ.50 నుంచి రూ.150 వరకు ఉంది. పెరిగిన ధరలతో మార్కెట్ వైపు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. సామాన్యుడికి అందుబాటులో ఉండేలా ధరలను నియంత్రించాలి.

షభానా బాను, గృహిణి, హిందూపురం.



ధరలు మండి పోతున్నాయి..

నిత్యం వండే కూరల్లో వాడాల్సిన కూరగాయల ధరలు ఆకాశంలో ఉంటే వాటిని ఎలా కొనాలి.? ఎలా వండాలి..? చికన్ కిలో రూ.350 నుంచి రూ.300 వరకు ఉంది. మటన్ పరిస్థితి అలానే ఉంది. రంజాన్ పండుగ రోజు మంచి భోజనం కూడా తినలేని పరిస్థితి ఉంది.

ఫయాజ్, హిందూపురం.



అధిక ధరలను నియంత్రించాలి

పెరిగిన నిత్యావసర ధరలను నియంత్రించి సామాన్యుడికి అందుబాటులో ఉండేలా చూడాలి. నిత్యం అవసరమైన కూరగాయల ధరలు అధికంగా ఉంటే సామాన్యుడి ఎలా బతకాలి. ప్రభుత్వాలు ధరలు తగ్గించేలా చర్యలు చేపట్టారు. పెరిగిన ధరల ప్రభావం రంజాన్ పండుగపై పడుతోంది.

షేక్ నూర్‌జహా, గృహిణి.

12న ఉమ్మడి జిల్లాలో 'సైకిల్ రావాలియాత్ర'

హాజరుకానున్న నందమూరి బాలకృష్ణ

ప్రజాశక్తి-కదిరి టౌన్



విలేకరులతో మాట్లాడుతున్న కందికుంట వెంకటప్రసాద్, బివి.వెంకటరాముడు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 12వ తేదీ శుక్రవారం నాడు టిడిపి ఆధ్వర్యంలో సైకిల్ రావాలి యాత్ర కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. యాత్ర 12వ తేదీ కదిరిలో ప్రారంభం అవుతంది. ఉదయం 9 గంటలకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలతో యాత్ర ప్రారంభం అవుతుంది. కదిరి నుంచి ముదిగుబ్బ, బత్తపల్లి, అనంతపురం, అక్కడి నుంచి శింగనమల నియోజకవర్గం గార్లదిన్నెలో యాత్ర కొనసాగుతుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను టిడిపి నాయకులు ఇప్పటికే పూర్తి చేశారు. సైకిల్ రావాలి యాత్రకు సంబంధించిన విశేషాలను శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షుడు బివి.వెంకటరాముడు, కదిరి టిడిపి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ బుధవారం నాడు విలేకరులకు వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సైకిల్ రావాలి యాత్రలో పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ పాల్గొంటున్నారని చెప్పారు. ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం పీవీ గ్రాండ్ చేరుకుంటారన్నారు. అక్కడి నుండి రోడ్డు షోగా బయలుదేరి జీవిమాన్ సర్కిల్, జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారన్నారు. అక్కడి నుంచి అంబేద్కర్ సర్కిల్ మీదుగా కాలేజి సర్కిల్ వరకు రోడ్డు షో కొనసాగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, బాలకృష్ణ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కదిరి టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

'రానున్న నెల రోజులు కీలకం'

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రానున్న 30 రోజులు చాలాకీలకమైనవని ప్రతి ఒక్కరూ గడప గడపకు వెళ్లి ధర్మవరంలో కూటమి అభ్యర్థి సత్యకుమార్‌ను గెలిపించేలా ప్రచారం చేయాలని బిజెపి, టిడిపి, జనసేన నాయకులు తెలిపారు. ధర్మవరం ఎన్డీఏ ఉమ్మడి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్, ధర్మవరం టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో బుధవారం నాడు శారదానగర్‌లోని బీజేపీ కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. అవినీతి, అరాచకం లేని ధర్మవరం కావాలంటే వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థి విజయం సాధించాలన్నారు. హిందూపురం టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధి సైకిల్ గుర్తుకు ఓటు వేసేవిదంగా ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. బుధవారం సాయంత్రం జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డిని సత్యకుమార్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

కేటాయించిన లక్ష్యాలను చేరుకోవాలి

జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కేటాయించిన లక్ష్యాలను త్వరితగతిన చేరుకోవాలని బ్యాంకర్లకు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. జిల్లాస్థాయి రివ్యూ కమిటీ, డిసిసి సమావేశం బుధవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే ఆర్థిక సంవత్సరానికి అణగారిన వర్గాల సంక్షేమాన్ని అభివద్ధిలో పెట్టుకుని యాక్షన్ ప్లాన్ నివేదికలు సిద్ధం చేసుకోవాలన్నారు. రిజర్వ్ బ్యాంక్ సూచనల మేరకు వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు పంపిణీ చేయడానికి మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి సంక్షేమంపై ప్రణాళికలకు శ్రీకారం చుట్టాల్సుందన్నారు. ఏ కారణం చేతనైనా రుణాలు ఇవ్వకున్నా దరఖాస్తుల తిరస్కరించినా సంబంధిత నివేదికను తనకు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డిఎం.రమణ కుమార్, నాబార్డ్ ప్రతినిధి అనురాధ, యూనియన్ బ్యాంక్ మేనేజర్ శివప్రసాద్, కెనరా బ్యాంకు ప్రతినిధి కిరణ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, డీఆర్డీఏ పీడీ నరసయ్య, మెప్మా పీడీ విజయలక్ష్మి, పశుసంవర్ధక శాఖ అధికారి శుభ దాస్, ఆర్టికల్చర్ అధికారి పద్మావతమ్మ, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, పరిశ్రమల శాఖ అధికారి చాంద్ బాషా, చేనేత జౌళి శాఖాధికారి రమేష్ బాబు, వివిధ బ్యాంకుల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకర్లతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

నెత్తురోడిన రహదారులు

ఉమ్మడి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు - నలుగురు మృతి.. ఐదుగురికి గాయాలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రహదారులు రక్తసిక్తం అయ్యాయి. బుధవారం నాడు పలు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో ఐదుగురు మరణించారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఉపాగి పండగ మరుసటి రోజున చోటు చేసుకున్న ఈ ఘటనలు ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి.



గుత్తి వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన అన్నాదమ్ములు చంద్రశేఖర్‌రెడ్డి, శివానందరెడ్డి

అన్నాదమ్ముల మృత్యువాత

గుత్తి : ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో అన్నదమ్ములు మతి చెందిన సంఘటన గుతి మండలంలోని ఎంగిలిబండ గ్రామ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తాడిపత్రి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఆర్.రామసుబ్బారెడ్డి, మహేశ్వరమ్మల పెద్ద కుమారుడు ఆర్.చంద్రశేఖర్ రెడ్డి(26) వ్యవసాయ పనులు చేసేవాడు. చిన్న కుమారుడు ఆర్.శివనంద రెడ్డి(24) బీటెక్ పూర్తి చేశాడు. అన్నదమ్ములు ఇద్దరు గుత్తి సమీపంలోని బాట సుంకలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు. అక్కడ కార్యక్రమం ముగిసిన అనంతరం స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. ఎంగిలిబండ గ్రామ సమీపంలో 67వ జాతీయ రహదారిపై వెళుండగా తాడిపత్రి వైపు నుంచి వేగంగా వస్తున్న కారు వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో అన్నదమ్ములు ఇద్దరూ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మరణించారు. పోలీసుల సంఘటన స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుమారులు ఇద్దరూ ప్రమాదంలో మరణించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘటనపై పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరు మృతి

పరిగి : మండల పరిధిలోని మోద చెర్లోపల్లి చెక్‌పోస్టు వద్ద బుధవారం సాయంత్రం ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పరిగి మండలం కొడిగేనహళ్లి పంచాయతీ పెద్దరెడ్డిపల్లికి చెందిన ఆదిమూర్తి(28) తన తల్లితో కలిసి ద్విచక్రవాహనంలో హిందూపురం వైపునకు వెళున్నాడు. ఇదే సమయంలో కర్ణాటక రాష్ట్రం తెరియూర్‌కు చెందిన శివన్న(26) హిందూపురం నుంచి ఆయన స్వగ్రామం వైపు ద్విచక్రవాహనంలో వెళ్తున్నారు. ఈ రెండు వాహనాలు చెర్లోపల్లి చెక్‌పోస్టు వద్దకు రాగానే ఎదురెదురుగా ఢీకొన్నాయి. రెండు వాహనాలు వేగంగా ఢీకొనడంతో ఆదిమూర్తి, శివన్నలు అక్కడికక్కడే మరణించారు. ప్రమాదంలో మృతి చెందిన ఆదిమూర్తి ఒకగానొక్క కుమారుడు కావడంతో ఘటనా స్థలం అతని తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. ప్రమాద విషయం తెలుసుకున్న పరిగి ఎస్ఐ సత్యనారాయణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.



ఆదిమూర్తి మృతదేహం వద్ద రోదిస్తున్న మహిళ



ప్రమాదానికి గురైన ప్రయివేటు బస్సు

పొలంలోకి దూసుకెళ్లిన ప్రయివేటు బస్సు

ఐదుగురికి గాయాలు- తప్పిన ప్రమాదం

పామిడి : డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ఓ ప్రయివేటు బస్సు పొలంలోకి దూసుకెళ్లిన ఘటన పామిడి మండలం గజరాంపల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం ఉదయం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ప్రయివేటు ట్రావెల్స్‌కు చెందిన ఎన్ఎల్01బి 1850 నెంబర్ గల వోల్వో బస్సు హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు ప్రయాణికులతో వెళ్తోంది. గజరాంపల్లి గ్రామం వద్దకు రాగానే డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ఒక్కసారిగా బస్సు అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను దాటుకుని అవతలి వైపు పొలంలోకి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో బస్సుల్లో ఉన్న హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ జహీర్, మహమ్మద్, పశ్చిమబెంగాల్‌కు చెందిన అగన్ అలీ, బెంగుళూరుకు చెందిన అశోక్ కుమార్, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ యూసఫ్‌కు రక్త గాయాలయ్యాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం 108లో స్థానికులు అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పామిడి పోలీసులు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివరామిరెడ్డి

ఎన్నికల విజయవంతంలో

అధికారుల పాత్ర కీలకం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఎన్నికలు విజయవంత కావాలంటే అధికారులదే కీలక పాత్ర అవుతుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివరామిరెడ్డి పేర్కొన్నారు. మన్సిపల్ కార్యాలయంలో బుధవారం నాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల పీఓలు, ఏపీవోలకు ఎన్నికల విధులకు సంబంధించి శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయోగాత్మకంగా ఓటు వేసే విధానాన్ని రిటర్నింగ్ ఆఫీసర్‌తో పాటు శిక్షకులు ప్రదర్శించారు. ఎన్నికల విధుల్లో గల అనుమానాలను నివత్తి చేశారు. ఇందుకు సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రొసిడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రొసిడింగ్ ఆఫీసర్లు చేయాల్సిన విధుల గురించి వివరించారు. ప్రతి ఒక్క అధికారి ఎన్నికల నియమావళిని బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. శిక్షకులు రాంప్రసాద్‌బీ. శ్రీనివాసులు, హేమంత్‌లు ఎన్నికల విధివిధానాలు, ఈవీఎంలు వాడే విధానాన్ని ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాంకుమార్, తహశీల్దార్ రమేశ్, ఉప ఎన్నికల అధికారి షణ్ముఖ యాదవ్ పాల్గొన్నారు.

13న రామ్, లక్ష్మణ్ టిడిపిలో చేరిక

పుట్టపర్తి అర్బన్ : పుట్టపర్తి యువతలో క్రేజ్ ఉన్న రామ్, లక్ష్మణ్ సోదరులు వైసిపిని వీడి ఈ నెల 13వ తేదీ టిడిపిలో చేరనున్నట్లు తెలుగు యువత నాయకుడు కిలారి శ్రీనాథ్ తెలిపారు. పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడుతూ 13వ తేదీ మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరరెడ్డి ఆధ్వర్యంలో రామ్, లక్ష్మణ్ సోదరులు 5వేల మందితో పార్టీలో చేరతారన్నారు. అదే రోజు 3వేల బైక్‌లతో పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాల్లో భారీ బైక్ ర్యాలీ, అనంతరం హనుమాన్ సర్కిల్‌లో భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. వారి చేరికతో నియోజకవర్గంలో టిడిపికి పూర్వ వైభవం రానుందన్నారు. పుట్టపర్తి మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా రామ్, లక్ష్మణ్ సోదరుల ప్రభావం ఎన్నికల్లో ఉంటుందన్నారు.



పాలిసెట్ నిర్వహణ, ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

పాలిసెట్‌కు పటిష్ట ఏర్పాట్లు : జెసి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పాలిటెక్నిక్‌లో ప్రవేశం కోసం జిల్లాలో ఈ నెల 27వ తేదీ పాలి సెట్ పరీక్షలు నిర్వహిస్తున్నామని అందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పాలి సెట్ ఏర్పాట్లపై జెసి బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. జిల్లాలో 23 పరీక్ష కేంద్రాల్లో 8వేల మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. హిందూపురం మున్సిపాలిటీలో 8, ధర్మవరం మున్సిపాలిటీలో 9, కదిరి మున్సిపాలిటీలో 6 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జెసి తెలిపారు. 27వ తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. పోలీసు, వైద్య సిబ్బందితో లైజెన్ అధికారి సమన్వయం చేసుకొని ఎలాంటి లోటుపాట్లు జరగకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాలను నో ఫోన్ జోన్లుగా ప్రకటించాలన్నారు. పరీక్షల వేళలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడిపి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, రెవెన్యూ అధికారులు, మున్సిపాలిటీ అధికారులు, పోలీస్ యంత్రాంగం పరీక్షల నిర్వహణలో ప్రముఖ పాత్ర వహించాలని ఆదేశించారు. సమావేశంలో సురేష్ బాబు, మున్సిపాలిటీ అధికారులు, డిప్యూటీ డిఎంహెచ్ఒ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'కందికుంట' ఇంటింటి ప్రచారం


వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న 'కందికుంట'

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండలంలోని సోమయాజులపల్లి పంచాయతీలోని కత్తివారిపల్లి, ఎనుములవారిపల్లి, సోమయా జులపల్లి, దళితవాడ, వేపలకుంట, బోలుగుట్లవారిపల్లి, ఎర్రజనుపల, మునగళ్లవారిపల్లి క్వాటర్స్, పోరెడ్డివారిపల్లి, తదితర గ్రామాల్లో బుధవారం కదిరి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన వైసిపి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ఓటు ద్వారా గట్టిగా బుద్ధి చెప్పాలని కోరారు. టిడిపి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలు ప్రతి ఇంటి వద్దకే అందుతాయని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సి.కొండయ్య, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ఎ.వెంకట రమణారెడ్డి, అడ్వొకేట్ కె.ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు శివప్పనాయుడు, అనసూయమ్మ, ఎంపిటిసి జయరామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచి ప్రసాద్‌రెడ్డి, పవన్‌కుమార్, రామానుజనరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


టిడిపిలో చేరిన వారికి కండువా వేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ

సవితమ్మ సమక్షంలో టిడిపిలో చేరిక

సోమందేపల్లి : మండలంలోని మండ్లి, జూలకుంట పంచాయతీల నుంచి 62 వైసిపి కుటుంబాలు బుధవారం టిడిపిలో చేరాయి. పెనుకొండ పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.


అధికారికి రాజీనామా లేఖలు అందజేస్తున్న వాలంటీర్లు

వాలంటీర్ల రాజీనామా

సోమందేపల్లి : పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని సచివాలయం-4కు చెందిన 14 మంది వాలంటీర్లు బుధవారం మూకుమ్మడి రాజీనామా చేశారు. వాలంటీర్లు మాట్లాడుతూ తాము స్వచ్ఛందంగా రాజీనామా లేఖలను అధికారులకు సమర్పించామని తెలిపారు. చంద్రబాబు వాలంటీర్లకు రూ. 10 వేల వేతనం ఇస్తామని చెప్పి రాజకీయంగా వాడుకోవడానికి చూస్తున్నారని పేర్కొన్నారు. తాము సిఎం జగన్ కోసం పని చేసి మరోసారి గెలిపించుకుంటామన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి మరమ్మతులు చేయాలని వినతి

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో ఉన్న డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి వేలు విరిగిపోయింది. ఆ వేలిని బాగు చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్‌డిఒ వెంకటశివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ అంబేద్కర్ జయంతి కార్యక్రమం ఉందని, ఆ లోపు విగ్రహానికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు కేశగాళ్ల వెంకటేశ్, బూదెప్ప, రామాంజనేయులు, గంగులు వెంకటేశ్, నాగరాజ్, బుక్కపట్నం శ్రీనివాస్, నారాయణస్వామి, కేశగాళ్ల ప్రదీప్, గణేశ్, కేశగాళ్ల ప్రభాస్, కుమార్, బాబు ఉన్నారు.

టిటిసి ట్రైనింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం : డిఇఒ

పుట్టపర్తి : ప్రభుత్వం వేసవిలో 42 రోజుల పాటు టిటిసి శిక్షణ ఇస్తుందని, ఈ నెల 25వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డిఇఒ మీనాక్షి, తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఎంపికైన వారికి మే 1 నుంచి జూన్ 11వ తేదీ వరకూ శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. 18-45 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. పదో తరగతి పాసై టిటిసిలో లోయర్ పూర్తయిన వారు, ఇంటర్మీడియట్‌లో ఒకేషనల్ కోర్సు పూర్తయిన వారు, ఐటిఐ సర్టిఫికెట్ ఉన్న దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి : సిఐ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని పుట్టపర్తి రూరల్ సిఐ రాగిరి రామయ్య సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉన్నందున నిబంధనల మేరకు ప్రశాంత వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలని కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలు చేపట్టరాదని, ముఖ్యంగా యువత ప్రశాంత వాతావరణంలో పండగను జరుపుకోవాలని పలు సూచనలు చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్లో పలు రికార్డులను పరిశీలించి, కేసుల పురోగతిపై ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. సిఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను ఎవరూ ఉల్లంఘించకూడదని, శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు.

ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

సత్యసాయి తాగునీటి పథకం పైపుల నుంచి నీటిని అక్రమంగా తన తోటలకు వాడుకున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజల దాహార్తి తీర్చడానికి సత్యసాయి నీటి సరఫరా పథకాన్ని అమలు చేయగా ఎమ్మెల్యే నాలుగేళ్లుగా జల చౌర్యానికి పాల్పడడం దుర్మార్గమన్నారు. తాగునీటి పథకం ద్వారా అందే నీటిని తన తోటలకు మళ్లించడం నీచమైన చర్య అన్నారు. నాలుగేళ్లుగా ప్రజల నీటిని దోపిడీ చేసిన ఎమ్మెల్యేపై వాల్టా చట్టం కింద కేసు నమోదు చేయాలన్నారు. అందుకు సహకరించిన అధికారులపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అధికారం ఉందని ఒక ప్రజాప్రతినిధి ఇష్టారాజ్యంగా వ్యవహరించడం దుర్మార్గమైన చర్య అన్నారు.


ఎస్పీ మాధవరెడ్డి | కందికుంట వెంకటప్రసాద్ | బత్తల హరిప్రసాద్

ముస్లిములకు శుభాకాంక్షలు

పుట్టపర్తి రూరల్ : జిల్లాలోని ముస్లింలకు ఎస్పీ మాధవరెడ్డి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలి పారు. నెల రోజుల పాటు ఎంతో పవిత్రంగా కఠోర ఉపవాస దీక్షలు ఆచరించి భక్తి ప్రపత్తులతో రంజాన్ పండుగ జరుపుకుంటున్నవేళ ముస్లిందరికీ ఈద్ ముబారక్ అన్నారు. రంజాన్ పండుగను అందరూ సోదర భావంతో సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు.

కదిరి టౌన్ : కదిరి నియోజకవర్గ ముస్లింలకు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్, డా. బత్తల హరిప్రసాద్ వేర్వేరు ప్రకటనల్లో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో నెల రోజులు పాటు నమాజ్, కఠిన ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు రంజాన పండగను కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఎన్నికలకు ముందే చేతులెత్తేసిన చంద్రబాబు

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్


ప్రచారంలో పాల్గొన్నా వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్, తదితరులు

ప్రజాశక్తి-తలుపుల

2014లో అధికారం చేపట్టగానే అమలు చేయలేని హామీల మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించిన టిడిపి ప్రస్తుతం ఎన్నికలకు ముందే ఆ పార్టీ నాయకులు మాట తప్పారని కదిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బిఎస్ మక్బూల్ విమర్శించారు. ఆయన బుధవారం మండలంలోని తురకవాండ్లపల్లి, కొరుగుట్టపల్లి, ఎర్రసానిపల్లి, మాడికివాండ్లపల్లి, బురుజుపల్లి, తదితర గ్రామాల్లో స్థానిక వైసిపి శ్రేణుల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సిఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించి ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ నిన్నటి వరకూ సూపర్ సిక్స్ అంటూ అమలు చేయలేని హామీలు ఇచ్చిన కూటమి సభ్యులు నేడు సూపర్‌సిక్స్‌ను రద్దు చేస్తూ కొత్త మేనిఫెస్టోను విడుదల చేస్తామంటూ మరోసారి రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికి కొత్త ఎత్తుగడలు వేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో టిడిపి మనుగడే కష్టమైన తరుణంలో పార్టీని ఎలా గట్టెక్కించాలో తెలియని చంద్రబాబు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. అందులో భాగంగా ఆచరణ సాధ్యం కాని హామీల మేనిఫెస్టోను చూపించి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఏకైన సిఎం జగన్ అన్నారు. రాబోయే ఎన్నికల కోసం ప్రజలకు రెండింతల మేలు చేకూర్చేలా జగన్ ప్రజా మేనిఫెస్టోను త్వరలో విడుదల చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, రాష్ట్ర సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, సేవాదల్ జోనల్ ఇన్‌ఛార్జి డికె.బాబు, ఎంపిపి రఫీ నాయక్, మండల కన్వీనర్ ఫయాజ్, మాజీ జడ్పిటిసి కులశేఖర్‌రెడ్డి, నాయకులు కులశేఖర్‌రెడ్డి, వివేకానందరెడ్డి, కుర్లి శివారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక


మాజీ ఎమ్మెల్యే ఈరన్న సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే ఈరన్న సమక్షంలో పలువురు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. మండలంలోని మలేరొప్పం గ్రామానికి చెందిన రమేష్, నవీన్, మహేష్‌తో పాటు పలువురికి ఈరన్న టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈరన్న మాట్లాడుతూ టిడిపి హయాంలోనే అన్ని వర్గాల వారికీ న్యాయం జరిగిందని, దీంతో ప్రతి గ్రామంలో వైసిపిని వీడి టిడిపిలోకి చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో నాయకులు దోచుకోవడం తప్ప మడకశిర నియోజకవర్గంలో ఏ మాత్రం అభివృద్ధి జరగలేదన్నారు. రాష్ట్రం అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని నమ్మి టిడిపిలో చేరామని, సునీల్‌కుమార్ గెలుపు కోసం తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆదినారా యణ, అశ్వత్థరామప్ప, బొజ్జప్ప, చందకచర్ల దేవ్లానాయక్, శివరుద్రప్ప, మండల జనసేన అధ్యక్షుడు శివాజీ, తరుణ్, నాగరాజు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులు జాగ్రత్త వహించాలి


వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి వచ్చిన గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న నాగేళ్ల రంజిత్

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల పిల్లలు, వృద్ధులు, ప్రధానంగా గర్భిణులు జాగ్రత్త వహిం చాలని వైద్యాధికారి డాక్టర్ కమల్ రోహిత్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవా రం ప్రధానమంత్రి సురక్షిత మాతృ వందన అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ వడదెబ్బ అతి ప్రమాదకరమని పిల్లలు, వృద్ధులు, గర్భిణులు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్త వహించాలన్నారు. వడదెబ్బకు గురైతే వెంటనే వారిని నీడ ఉన్న ప్రదేశానికి చేర్చడం, శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చేంత వరకూ శరీరాన్ని తడి గుడ్డతో తుడవడం, చల్లని గాలి తగిలేలా ఉంచడం, ఇంటి వైద్యంలో భాగంగా చిటికెడు ఉప్పు, చారెడు చక్కెర మిశ్రమ ద్రావణం లేదా ఒఆర్ఎస్ ద్రావణం తాగించడంతో పాటు వెంటనే సమీప ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు. రక్తహీనత, పోషక విలువల ఆహార లభ్యత, వినియోగం, హైరిస్క్ లక్షణాల గుర్తింపు, ఆసుపత్రి ప్రసవం, మలేరియా, డెంగీ, టిబి, కుష్టు, తదితర వ్యాధులతో పాటు ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించారు. గర్భిణులకు వివిధ రకాల పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. హాజరైన గర్భిణులు, వారి సహాయకులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దాతలు నాగేళ్ల రంజిత్ కుటుంబ సభ్యులు భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య, ఆశా, అంగన్వాడీ సిబ్బంది, పాల్గొన్నారు.

కనిపించిన నెలవంక.. నేడు రంజాన్

ముస్తాబైన ఈద్గా మైదానాలు, మసీదులు


ఈద్గా మైదానంలో జామియా కమిటీ వారితో సమీక్షిస్తున్న వైసిపి నాయకులు వేణురెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

పవిత్ర రంజాన్ మాసంలో నెలవంకను చూసి ముస్లింలు కఠిన ఉపవాస దీక్షలను ప్రారంభిస్తే.. మళ్లీ నెలవంకను చూసి పండుగను జరుపుకుంటారు. బుధవారం నెలవంక కనిపించడంతో గురువారం పవిత్ర రంజాన్ పండుగను జరుపుకుంటున్నారు. పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల కోసం పట్టణంలోని ఆర్‌పిజిటి రోడ్డులో ఉన్న అల్ హి లాల్ ఈద్గా మైదానంతో పాటు రహమత్‌పురం, మేళాపురం, కోట, మోడల్‌కాలనీ, పూలకుంట, తదితర ప్రాంతాలతో పాటు వివిధ మసీదుల్లో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు జరుపుకోవాడానికి ముస్తాబు చేశారు. ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. నాలుగు రోజుల క్రితం శ్మశానవాటికలో జరిగిన అల్లర్లను దృష్టిలో పెట్టుకుని రంజాన్ సందర్భంగా పట్టణంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

పవిత్ర రంజాన్ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించే ఈద్గా మైదానాల్లో వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని వైసిపి నాయకులు వేణురెడ్డి తెలిపారు. ఆయన బుధవారం అల్ హి లాల్ ఈద్గా మైదానంలో పనులను పర్యవేక్షించి, జామియా కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ప్రార్థన స్థలాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఇప్పటికే అధికారులను కోరామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ జబివుల్లా, జామియా కమిటీ ముతవల్లి నూరుల్లా, సానీ ముతవల్లి హుమయూన్, ఖలీల్, అల్లా బకాష్, సిరాజ్, ముస్తఫా, మార్కెట్ చాంద్‌బాషా, వైసిపి నాయకులు షాజహాన్, తదితరులు పాల్గొన్నారు.


టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం


ఎన్నికల ప్రచారంపై సమావేశం నిర్వహిస్తున్న టిడిపి మండల కన్వీనర్ నరహరి

ప్రజాశక్తి-రొద్దం

సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేసి పెనుగొండలో టిడిపి జెండా ఎగురవేయాలని మండల కన్వీనర్ నరహరి కోరారు. గురువారం నుంచి మండల టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలతో కలిసి రొద్దం మండలంలో పంచాయతీల వారీగా ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 11వ తేదీ దొడగట్ట పంచాయతీ, 12న నారనాగేపల్లి పంచాయతీ, 13న కంబాలపల్లి పంచాయతీ, 14న లోచర్ల పంచాయతీ, 15న చోలేమర్రి పంచాయతీల్లో పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ, హిందూపురం ఎంపి అభ్యర్థి బికె.పార్థసారథికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున రొద్దం మండ లంలోని టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, చంద్రమౌళి, పెనుగొండ నియోజకవర్గ కమిటీ అధ్యక్షులు చిన్నప్పయ్య, మాధవనాయుడు, వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపిపి నరసింహులు, వీరాంజి, తిరుపాల్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సునీల్‌కుమార్ దృష్టికి ఎం.రాయపురం సమస్యలు


టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్‌తో సమావేశమైన ఎ.రాయపురం యువకులు

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్‌ను బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయం లో ఎం.రాయపురం గ్రామస్తులు, యువకులు కలిశారు. రొళ్ల మండలంలోని యువకులు జీవనోపాధి కోసం కర్నాటకలోని బెంగళూరు, తదితర ప్రాంతాలకు వలస వెళ్లారు. వారు సునీల్‌కుమార్‌ను కలిసి ఎం.రాయపురం పంచాయతీలో నెలకొన్న సమస్యలను వివరించారు. స్పందించిన సునీల్‌కుమార్ మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే ఆయా సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతి 6 నెలలకోసారి బెంగళూరులో సమావేశాలు నిర్వహిస్తానని, యువతను అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. ఈ నెల 14వ తేదీ బెంగళూరు టిడిపి ఫోరం ఆధ్వర్యంలో జరిగే కార్యకర్తల సమావేశాన్ని బాగలగుంటే సిగ్నల్ వద్ద ఉన్న శ్రీసాయి కళ్యాణ మండపంలో నిర్వహిస్తామని, బెంగళూరులో ఉన్న యువకులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమలంలో టిడిపి పార్టీ రాష్ట్ర రైతు కార్యదర్శి కెఎన్ పల్లి సురేష్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎన్నికల పిఒ, ఎపిఒలకు శిక్షణ

హిందూపురం : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పిఒ, ఎపిఒలకు బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో తహశీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక నిపుణుల చేత శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు అమరేంద్ర, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


శిక్షణలో పాల్గొన్న పిఒలు, ఎపిఒలు

చికిత్స పొందుతూ యువకుడి మృతి


నరసింహులు

రొద్దం : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నరసింహులు(16) చికిత్స పొందుతూ బుధవా రం మృతి చెందాడు. వివరాలు.. రెండు రోజుల క్రితం పెనుగొండ-పావగడ ప్రధాన రహదారిపై మండ లంలోని ఆర్.మరవపల్లి సమీపంలోని మసీదు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసింహులు తీవ్రంగా గాయపడ్డాడు. అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం కర్నాటకలోని పావగడ తాలూకా కోడమడుగు గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. కుమారుడితో మృతితో తల్లిదండ్రులు బోరున విలపించారు.



అధికారులకు సూచనలు ఇస్తున్నారు భాగ్యరేఖ

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

రెవెన్యూ డివిజనల్ అధికారి కెఎస్.భాగ్యరేఖ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డిఒ) కెఎస్.భాగ్యరేఖ కోరారు. పట్టణంలోని సాయి ఆరామంలో బుధవారం ఆర్‌డిఒ అధ్యక్షతన పుట్టపర్తి పిఒ, ఎపిఒ, సెక్టార్ ఆఫీసర్లకు పోలింగ్ నిర్వహణ, ఈవిఎంల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మాక్ పోల్, పోలింగ్, ఫారములు భర్తీ, సీలింగ్, పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ ఏజెంట్స్, రిసెప్షన్ సెంటర్, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అలాగే వారి సందేహాలను మాస్టర్ ట్రైనర్లు ఫైజుల్లా, ఈశ్వరయ్య, జయరాములు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నివృత్తి చేశారు. ఎన్నికల కమిషన్ సూచనలు, ఉత్తర్వులను పాటిస్తూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సక్రమంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం, అమడగూరు, నల్లమాడ తహశీల్దార్లు ఎ.వేణుగోపాల్, కళావతి, భారతి, వై.రామనాథరెడ్డి, నాగభూషణం, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ కె.నరసింహులు, మనోజ్‌కుమార్, డిప్యూటీ తహశీల్దార్ స్వాతి పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్‌పై సమీక్ష నిర్వహిస్తున్న తహశీల్దార్ శివశంకర్‌నాయక్

పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్‌పై సమీక్ష

తహశీల్దార్ శివశంకరనాయక్

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలో సమస్యాత్మకంగా, ఇబ్బందికరంగా ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అక్కడ వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లు చేస్తామని తహశీల్దార్ శివశంకరనాయక్ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం తహశీల్దార్ ఎస్ఐ శ్రీనివాసులుతో కలిసి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలో సమస్యాత్మక, ఇబ్బందికరంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. అక్కడ వెబ్ క్యాస్టింగ్ ద్వారా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ప్రతి గ్రామ రెవెన్యూ అధికారి గ్రామంలో ప్రతి రోజూ పర్యటించి సమస్యలుం టే వెంటనే కార్యాలయానికి సమాచారం ఇవ్వాలన్నారు. హోం ఓటింగ్‌కు సంబంధించి 85 ఏళ్లు పైబడిన వారు, అధిక శాతం వైకల్యం కలిగిన వికలాంగులు ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. బిఎల్‌ఒలు ఓటు ప్రాముఖ్యతను వివరించడంతో పాటు పోలింగ్ స్టేషన్‌కు రాలేని వారు ఇంటి వద్ద నుంచే ఓటు వేసేలా తెలియజేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో అన్ని సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు.


మాజీ ఎమ్మెల్యే సూరిని కలిసి స్వీట్ తినిపిస్తున్న ముస్లిం మైనార్టీలు

మాజీ ఎమ్మెల్యే సూరిని కలిసిన మైనార్టీలు

ధర్మవరం టౌన్ : మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణను బుధవారం ధర్మవరం పట్టణ ముస్లిం మైనార్టీలు అనంతపురంలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి స్వీట్ తినిపించారు. అనంతరం గోనుగుంట్ల సూర్యనారాయణ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

'అంబికా'ను కలిసిన నార్పల జనసేన నాయకులు

నార్పల : ఎన్‌డిఎ అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణను మండల జనసేన నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతపురంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో అంబికాను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భం గా అంబికా మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబును కక్షపూరితంగా జైల్లో పెడితే అండగా నిలిచిన ఏకైన వ్యక్తి పవన్‌కళ్యాణ్ అన్నారు. అలాంటి వ్యక్తి ఎన్నికల్లో కూడా కలిసి కొనసాగడం సంతోషకరమన్నారు. ఆయన లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కూటమి అభ్యర్థుల విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ గంజికుంట రామకృష్ణ, పొన్నతోట రామయ్య, వినోదం నారాయణస్వామి, సిద్ధరాచెర్ల హరినాథ్, శివమోహన్, వినోదం, లోకేష్, చామలూరు విజయ్, నరసింహా, జనసైనికులు పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి శ్రీముడి

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మల్లాపురం గ్రామ సమీపంలో వెలిసిన విప్రమలై లక్ష్మీ నరసింహస్వామి శ్రీముడి కార్యక్రమం బుధవారం వైభవంగా సాగింది. ఇందులో భాగంగా మాఘ పౌర్ణమి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం రోజున మాలాధారణ ధరించిన 40 మంది భక్తులు 48 రోజుల దీక్ష అనంతరం బుధవారం ఉగాదిని పురస్కరించుకుని మాలను తీసివేశారు. ఉదయం ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో ఆలయం కమిటీ గౌరవాధ్యక్షులు రామ్మూర్తి స్వామీజీ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, నైవేద్యం వంటి పూజలు చేశారు. శ్రీముడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి కాలినడకన నరసింహస్వామి ఆలయానికి చేరుకున్నారు. ఆలయం వద్ద మాలాదరణ స్వాములవారికి మెట్ల పూజ నిర్వహించి శ్రీముడిని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు విశ్వనాథరెడ్డి, గౌని ఉపేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు ధర్మన్న, కోశాధికారి నరసింహులు, కోశాధికారి సత్యనారాయణ, గురు రాఘవేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సున్నీ రోషన్ మసీదులో చోరీ

గుత్తి : గుత్తి ఆర్ఎస్‌లోని మెయిన్ బజార్‌లో ఉన్న సున్నీరోషన్ మసీదులో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. దుండగుడు మసీదులోకి చొరబడి మూలన మూడేళ్లగా ఉన్న హుండీని పగలగొట్టాడు. అందులో ఉన్న రూ.15వేలు నగదును దోచుకెళ్లాడు. చోరీ దృశ్యాలు మసీదులోని సీసీ కెమెరా ఫుటేజీలో బయటపడ్డాయి. ఘటనపై మసీదు కమిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం విక్రేత అరెస్టు

శింగనమల : మండల పరిధిలోని ఈస్ట్ నరసాపురంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న లింగుట్ల పుల్లయ్యను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. నిందితుడి నుంచి 36 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.